బీడు.. రైతుల గోడు



అమడగూరు సమీపంలో బీడుగా మారిన పొలాలు

- ముందుకెళ్లని పంటల సాగు
- అరకొరగా సాగైన పంటలు ఎండుముఖం

అమడగూరు: అదను దాటిపోతున్నా చినుకు నేలరాలలేదు. పంటలతో కళకళలాడాల్సిన ఖరీఫ్ ఈసారి ముందుకు సాగక రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. విత్తనాలు సిద్ధంగా ఉంచుకున్నా వరుణుడు కరుణించకపోవడంతో పొలాలన్నీ బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యవసాయ, రెవెన్యూ అధికార గణాంకాల ప్రకారం అమడగూరు మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు 6,482 హెక్టార్లు. ప్రస్తుతం 1,049 హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు. సాగు చేసిన రైతులు కూడా అయోమయంలో పడిపోతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్న ఆశతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని.. పంటలు పండకపోతే అప్పులెలా తీర్చాలని కలత చెందుతున్నారు.

వలసలు తప్పవా?

మండల వ్యాప్తంగా 9,864 మంది రైతులు ఉన్నారు. ఎక్కువ మంది వేరుశనగ సాగు చేస్తారు. అయితే జూలై ఆఖరవుతున్నా వర్షాలు కురవకపోవడంతో ఇక వేరుశనగ పంట వేసే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు భూగర్భ జలాలు ఇంకిపోతుండటంతో బోరుబావుల్లో సైతం నీరు రాక, వాటి కింద సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఖరీఫ్‌లో పంటల సాగు లేకపోవడంతో రైతులతోపాటు వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదు. మండలవ్యాప్తంగా దాదాపు 12 వేలకు పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేయకపోవడంతో వీరంతా వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇదిలా ఉండగా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వేరుశనగ ఎండిపోతోంది



ముంగారు ఆరంభంలో కురిసిన వానలకు మహమ్మదాబాద్ వద్ద 3 ఎకరాల్లో వేరుశనగ పంట వేశా. అయితే వానలు వెనక్కి పోవడంతో పంట ఎండిపోతోంది. పొలంలో వేసిన బోరులో నీరు సరిగా రావడం లేదు. పొలం దుక్కులు, విత్తనాలు, కూలీలకు ఇప్పటివరకూ రూ.70 వేలు పెట్టుబడిగా పెట్టా. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– తనకంటి జయప్ప, కందుకూరిపల్లి, అమడగూరు మండలం

చిరుధాన్యాలను సబ్సిడీతో ఇవ్వాలి



వేరుశనగ సాగు చేయాలని, 4 ఎకరాల పొలం దుక్కులు చేసుకుని, 9 బస్తాల కాయలను తీసుకుని, విత్తనాలను సిద్ధం చేసుకున్నాను. అయితే ఇంతవరకూ చినుకులు పడలేదు. ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ పంటలుగా చిరుధాన్యాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలి. వేరుశనగ సాగు చేయని రైతులందరూ చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవడానికి వీలుగా ఉంటుంది.

– లోకేష్‌రెడ్డి, కస్సముద్రం, అమడగూరు మండలం

చిరుధాన్యాలు సాగు చేసుకోవచ్చు



ఈ నెలాఖరులోగా వేరుశనగను విత్తుకోవాలి. తర్వాత వేరుశనగ పంటలకు అదను ఉండదు. ఆగస్టు నుంచి రాగి, ఉలవలు, కొర్రలు, సామలు లాంటి చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవచ్చు. రైతులు ఒకే పంట మీద ఆధారపడకుండా, వ్యవసాయ అధికారుల సలహాల పాటిస్తూ చిరుధాన్యాల సాగుకు మొగ్గు చూపాలి.

– వెంకటరమణాచారి, వ్యవసాయాధికారి, అమడగూరు మండలం

30న ఖాద్రీ ఆలయంలో బహిరంగ వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన లావు బియ్యం, 15 కేజీల ఖాళీ డబ్బాలను ఈనెల 30న బహిరంగ వేలం వేయనున్నట్లు ఈఓ వి. శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. లావు బియ్యంకు రూ.50 వేలు, ఖాళీ డబ్బాలకు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10:30 గంటలకు ఆలయంలో వేలం ప్రారంభమవుతుందని తెలిపారు.

వడ్డెర్ల అభ్యున్నతికి కృషి

పుట్టపర్తి టౌన్: వడ్డెర్ల అభ్యున్నతికి కృషి చేస్తామని వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి స్థానిక శిల్పారామంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుండగులు మారెప్ప అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉత్తన్న, సభ్యులుగా వలిపి గంగరాజు, డీలర్ పెద్దన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుండంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నామన్నారు. వడ్డెర్లకు కమ్యూనిటీ భవనం, విద్యార్థులకు వసతి గృహాల ఏర్పాటు కోసం కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. నాయకులు దళవాయి వెంకటనారాయణ, గంగులప్ప, శ్రీనివాసులు, వెంకటరాముడు, రఘురాములు, జయమ్మ, వెంటకపతి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

26పీటీపై202– ఐక్యతను చాటుతున్న వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు

క్లుప్తంగా

ఆస్పత్రిపై నమ్మకం కలిగేలా సేవలందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి విజయప్రసాద్

తాడిమర్రి: ప్రభుత్వాస్పత్రిపై నమ్మకం కలిగేలా వైద్య సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి విజయప్రసాద్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఎంపీడీఓ మణిమంజరితో కలసి తనిఖీ చేశారు. కాన్పుల గది, ల్యాబ్, అడ్మిషన్ గది, మరుగదొడ్లను పరిశీలించారు. అనంతరం రోగుల ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలు, పంపిణీ, టీకాలు తదితర రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారులతో మాట్లాడుతూ 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రులకు రావాలని రోగులకు సూచించారు. వైద్యాధికారులు హరిత, గోవర్ధన్ నాయుడు, సీహెచ్ఓ హేమలత, పీహెచ్ఎన్ లక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కోటి గురుమూర్తికి నివాళి



అనాథ ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న కోటి గురుమూర్తి కుటుంబ సభ్యులు

బత్తలపల్లి: బీసీ నేత కోటి గురుమూర్తి 34వ వర్ధంతిని శుక్రవారం స్థానిక కోటి గురుమూర్తి స్మృతివనంలో నిర్వహించారు. ఈసందర్భంగా గురుమూర్తి ఘాట్ వద్ద కోటి గురులక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, మల్లీశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కోటి సురేష్ కుమార్, మమత ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అనంతపురం మండలం కాటిగానికాలువ వద్దనున్న ఆశ్రయ అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. గురుమూర్తి కుటుంబ సభ్యులు పూజిత్ గురుశరణ్, యోక్షిత్‌రామ్, షనిత్ గురునందన్‌లతో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రీడల్లో ప్రతిభ చూపిన పాఠశాల విద్యార్థులను అభినందించారు. పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, కబడ్డీ టోర్నీలో రన్నర్స్‌గా నిలిచారు. ఈసందర్భంగా హెచ్ఎం పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో బోరు



బోరు వేయిస్తున్న దాత నారపరెడ్డిగారి లింగారెడ్డి

బత్తలపల్లి: శ్మశాన వాటికలో కర్మక్రియలు నిర్వహించడానికి దాత నారపరెడ్డి గారి లింగారెడ్డి శుక్రవారం ఉచితంగా బోరు వేయించి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. అప్పరాచెరువు గ్రామంలోని స్మశాన వాటికలో కర్మక్రియలు నిర్వహించాలంటే నీటి సమస్యతో ఇబ్బంది పడేవారు. స్పందించిన ఆయన బోరు వేయించారు. బోరులో నీరు లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దాతను గ్రామస్తులతో పాటు బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప అభినందించారు.

ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ



ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైద్య బృందం

ఓడీచెరువు: మండల కేంద్రంతోపాటు ఎంబీ క్రాస్, కొండకమర్లలో ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ సునిల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని ఆర్ఎంపీలకు సూచించారు. డాక్టర్ కమల్ రోహిత్, ఆరోగ్య విస్తరణాధికారి నగేష్, ఆరోగ్య విద్యా బోధకురాలు సుశీలమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మందుల కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మురళీమోహన్

చెన్నేకొత్తపల్లి: ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని ఆసుపత్రి ప్రత్యేక అధికారి మురళీమోహన్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బంది వివరాలు, మందుల వివరాలను వైద్యులు రవినాయక్, ప్రశాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారా అని అక్కడి రోగులతో విచారించారు. ఆస్పత్రిలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. వాటిని ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రాత్రి సమయాల్లో కూడా రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ముఖ్యంగా కుక్కకాటు, పాముకాటుకు మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

కార్గిల్ సైనికుల త్యాగాలను మరువొద్దు



తనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మక్బూల్‌హుస్సేన్



సైనికులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: కార్గిల్‌లో వీరమరణం పొందిన సైనికుల త్యాగాలను మరువకూడదని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ వలంటీర్లు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు గడిచినా సందర్భంగా అప్పటి స్మృతులను విద్యార్థులకు చూపించామన్నారు. ఎన్‌సీసీ అధికారి పావని, కళాశాల అధ్యాపకులు షమీవుల్లా, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, వెంకటలక్ష్మి, పుష్పవతి, తాహీర్, మీనా, ఆనంద్, గంగ పాల్గొన్నారు.

పుట్టపర్తి: ధైర్యసాహసాలే సైనికులకు ఆయుధాలుగా మారుతాయని శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మక్బూల్ హుస్సేన్ పేర్కొన్నారు. బుక్కపట్నంలోని కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి అలవర్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఓబులేసు, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, రాజమహమ్మద్, లైబ్రేరియన్ వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలో టీం భగత్‌సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మూడురోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీం భగత్‌సింగ్ సభ్యులు ఎం, యోగీ, వెంకటేష్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలర్పించి అమరులైన వీర సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటరమణారెడ్డి, అధ్యాపకులు జయచంద్ర, మధుసూదన్, హారతి, బయారెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్ఎం హరిప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు ముబారక్, సురేష్, ఇనాయతుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి

చెన్నేకొత్తపల్లి: కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ రాఘవేంద్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధం పాకిస్తాన్ భారత్ మధ్య జరిగిందన్నారు. ఈ యుద్ధంలో భారత సైన్యం విజయకేతనం ఎగురవేసిందన్నారు. అయితే భారతదేశానికి చెందిన పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. అయినా వీరోచితంగా పోరాడి విజయం సాధించారన్నారు. అమరులైన వీర జవాన్లను స్మరించుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. అంతకుముందు విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు స్థలం దక్కేదాకా పోరాటం

బత్తలపల్లి: స్థానిక నిడిమామిడి మఠం భూమిలో పేదలకు ఇళ్ల స్థలం దక్కేదాకా పోరాటాం చేస్తామని సీపీఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 401 సర్వే నెంబర్లో 19.84 ఎకరాలు భూమి కర్ణాటకలోని నిడిమామిడి మఠానికి చెందినదన్నారు. సుమారు 3 వేల మంది నివేశ స్థలాలు కోసం 17 రోజులుగా రాత్రింబవళ్లు గుడిసెలలో కాలం వెల్లదీస్తుండగా ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులుగాని ఏ ఒక్కరూ ఇప్పటి వరకు కన్నెత్తి చూడలేదని ఆయన విమర్శించారు. సీపీఐ చేనేత సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మాల్యవంతం కుళ్లాయప్ప తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ముదిగుబ్బ: మంగళమడక గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగేశవలరెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన ఆధార్ నమోదును పరిశీలించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఆధార్ నమోదు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని శివ పంచాయతన ఆలయంలో శుక్రవారం శివపార్వతులు కూరగాయల అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అఖిల గాండ్ల సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ధర్మవరం రూరల్: పోతులనాగేపల్లి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ఎట్టి ఓబన్న శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, వీఆర్‌ఓ భాస్కర్, మండలంలోని వీఆర్‌ఏలు తదితరులు గ్రామానికి వెళ్లి ఓబన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.25 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

కదిరి టౌన్: పట్టణంలోని మారుతినగర్‌లో గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మారుతినగర్‌కు చెందిన సాదిక్(53) పట్టణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటిలో ఉండగా ఛాతీలో నొప్పిగా ఉందంటూ కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ముదిగుబ్బ: మర్తాడులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ సరస్వతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆమె సిబ్బందికి సూచించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట



చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున గంగమ్మ దేవి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఆలయంలో ఉన్న విగ్రహం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో నూతన విగ్రహాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. గురువారం రాత్రి అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలోని వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం శుక్రవారం తెల్లవారు జామున వేద పండితులు గంగమ్మ దేవి విగ్రహానికి ప్రత్యేక అనంతరం ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ వెంగన్న శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచారయులు, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్ర తెలిపారు. కంటిచూపు తగ్గిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు.

ఫిజియోథెరపీతో వైకల్యం దూరం

కనగానపల్లి: అవయలోపం ఉన్నవారు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించుకోవడం ద్వారా కొంత వరకు అంకవైకల్యాన్ని నివారించుకోవచ్చని ఫిజియోథెరపిస్ట్ చంద్రకళ తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. క్యాంపును ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ చంద్రమౌళి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కనగానపల్లి: విష జ్వరాలు వ్యాపించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాలల విద్యార్థులతో కలసి ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల వ్యాపించే చికున్ గున్యా, డెంగీ, మలేరియా తదితర విష జ్వరాల వ్యాపింపజేసే దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ధర్మవరం రూరల్: వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా కంది, ఆముదం, రాగి, పప్పు దినుసులు సాగు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా, ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య రైతులకు సూచించారు. శుక్రవారం తుమ్మల గ్రామంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులతో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, భూసార పరీక్షలు, ఎరువుల వాడకం, డ్రోన్ ద్వారా సస్యరక్షణ మందుల పిచికారీ తదితర వాటిపై రైతులకు వివరించారు. అనంతరం గ్రామ పొలాల్లో సాగు చేసిన కంది పంటను వారు పరిశీలించారు. కందిలో అధిక దిగుబడులను సాధించాలంటే ఎకరాకు 12 వేల మొక్కల సాంద్రత ఉండాలన్నారు. దీని కోసం సాలుకు సాలుకు మధ్య ఒక అడుగు దూరం ఇవ్వాలన్నారు. కంది పంటలో రసం పీల్చే పురుగుల నివారణ కోసం ఎకరాకు ఒక లీటర్ వేప నూనెను పిచికారీ చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. ఏఓలు అబ్దుల్ ఆలీ, ముస్తఫా, ఏఈఓ దివ్య, రైతులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటుకు పరిశీలన



పాపాగ్ని నది వద్ద ఇసుక రీచ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తనకల్లు: మండలంలోని నాయనచెరువుపల్లి, తవళం, కొక్కంటి క్రాస్, టీ. సదుం తదితర ప్రాంతాల్లో ఇసుక రీచ్ కోసం స్థలాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. గనులు, భూగర్భ శాఖ అధికారి వాణీశ్రీ మాట్లాడుతూ నాయనచెరువుపల్లి, తవళం గ్రామాల వద్ద తగినంత ఇసుక లేదన్నారు. కొక్కంటి క్రాస్ సమీపంలో పాపాగ్ని నదికి ఒకవైపు రైల్వే బ్రిడ్జి మరో వైపు జాతీయ రహదారి బ్రిడ్జి ఉండడంతో అక్కడా రీచ్ ఏర్పాటు చేయడానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. టీ. సదుం దగ్గర పాపాగ్ని నది పక్కన ఇసుక రిచ్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్ ఏఈ బయప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కవిత తదితరులు పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న పీర్లు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఓడీచెరువు: మండల కేంద్రంలో శుక్రవారం మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముజవర్ మహబూబ్ బాషాఆధ్వర్యంలో పీర్లను అందంగా అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

ముదిగుబ్బ: మలకవేమల గ్రామంలో శుక్రవారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా పీర్లచావిడిలో పీర్లను కొలువుదీర్చారు. మంగళవారం జలధి, బుధవారం ఉరుసు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

టీసీ ఇప్పించండి

కొత్తచెరువు: ప్రభుత్వ పాఠశాలలో తన కుమార్తెను చేర్పించేందుకు టీసీ ఇప్పించాలని అమడగూరు మండలం రెడ్డివారిపల్లికి చెందిన సుధాకర్ కోరాడు. ఈమేరకు శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశాడు. అమడగూరులోని శ్రీప్రగతి విద్యానికేతన్ పాఠశాల తన కుమార్తె రెండో తరగతి వరకూ చదివిందని, ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఈ ఏడాది తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించానన్నారు. అయితే శ్రీప్రగతి విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ మంజునాథ్ టీసీ కోసం రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారన్నారు.

రోగులకు అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నదానం చేశారు. ఈసందర్భంగా సేవా సమితి సభ్యులు వైద్యులు, సిబ్బంది చేత ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులు 150 మందికి పాలు, బ్రెడ్డు, మధ్యాహ్నం భోజన ప్యాకెట్లు అందించారు. గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశారు.

గోరింటాకు అలంకరణలో పెద్దమ్మ



పూజలందుకున్న పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మ తల్లి ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా గోరింటాకు అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు వెంకటేష్ శర్మ అమ్మవారిని అభిషేకాల అనంతరం గోరింటాకుతో అలంకరించి పూజలు చేపట్టారు. మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఇదిలా ఉండగా గాంధీనగర్ శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారు ధరించిన చీరలను మహిళలకు పంపిణీ చేశారు.